
ప్రజాశక్తి
శుక్రవారం 19 డిసెంబర్ 2025 5 విజయనగరం



## ట్రైయినీ కానిస్టేబుళ్లు 20న హాజరు కావాలి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లా నుంచి ఇతర జిల్లాలకు ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులు ఆయా జిల్లాల్లోని ఎస్పి కార్యాలయాల్లో ఈనెల 20న హాజరు కావాలని ఎస్పి ఎఆర్ దామోదర్ తెలిపారు. ఈ నెల 22 నుండి శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు కానిస్టేబుళ్ళుగా ఎంపికైన అభ్యర్థులు జిల్లా పోలీసు కార్యాలయం వద్ద లగేజితో హాజరుకావాలన్నారు. అభ్యర్థులు తమతో పాటు 5 పాస్‌పోర్టు సైజు కలర్ ఫోటోలు, 2 స్టాంప్ సైజు కలర్ ఫోటోలు, ఒరిజినల్ సర్టిఫికెట్లు, రూ.100 నాన్ జుడిషియల్ బాండు, కప్పుకునేందుకు రెండు బ్లాంకెట్లు, పదివేలు కాషన్ డిపాజిట్, మెస్ ఛార్జీలు కోసం తీసుకురావాలని తెలిపారు. హాజరైన అభ్యర్థులను 9నెలల శిక్షణ నిమిత్తం పురుష అభ్యర్థులను డిటిసి, చిత్తూరుకు, మహిళా అభ్యర్థులను పిటిసి ఒంగోలుకు పంపుతామని తెలిపారు. శిక్షణా కేంద్రానికి అభ్యర్థుల వెంట బంధువులను అనుమతించరని ఎస్పి తెలిపారు.

అభివృద్ధి పనుల జాప్యంపై

# కార్పొరేటర్ల ఏకరువు



సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు, మేయర్ విజయలక్ష్మి

### పలు పనులు చేపట్టేందుకు కౌన్సిల్ ఆమోదం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

'మాకు ఉన్నది మూడు నెలల పదవీ కాలం. ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి పనులు చెప్పుకోవడానికి మాకు ఇబ్బందిగా ఉంది, వార్డుకు కేటాయించిన రూ20 లక్షలు విలువైన పనులు 50 డివిజన్లోనూ పనులు ప్రారంభం కాలేదు, జనరల్ ఫండ్ నిధులతో, ఎస్సీ, ఎస్టీ గ్రాంట్లు, 15 వ ఆర్థిక సంఘం పనులు కేటాయించినవి పూర్తి కాలేదు. మేము ప్రజలకు ఏమి సమాధానం చెబుతాం' అంటూ కార్పొరేటర్లు ఏకరువు పెట్టారు. గురువారం నగరపాలక సంస్థ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఎజెండాలో అంశాలపై చర్చ జరుగుతున్నప్పుడు అభివృద్ధి పనులకు సంబంధించిన వాటిపై కార్పొరేటర్లలో సగనిపైగా సభ్యులు ఏకరువు పెట్టారు. ఇప్పటి వరకు చేసిన పనులు ఎన్ని, చేయాల్సినవి ఎన్ని అని సభ్యులు ప్రశ్నించారు. దీంతో మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాదరావు సమాధానం చెబుతూ ఇప్పటి వరకు 89 పనులు పూర్తి చేశామని, 82 పనులు అభివృద్ధి దశలో ఉన్నాయని, 78పనులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. 37పనులు టెండర్ దశలో ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి ఏడాదిగా నగరంలో కుంటిపడిపోయిందని కో ఆప్షన్ సభ్యులు ఆసపు వేణు అసహనం వ్యక్తం చేశారు. నగరంలో పార్కులూ కబ్జాలు పాలవుతున్నాయని, వాటి రక్షణకు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు సంతోషి, రాజేష్ కోరారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలు కాకుండా ప్రత్యేకంగా నగర పాలక సంస్థ ఆస్తులుగా గురించి బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. నగరంలో ఆక్రమణలు,అక్రమ నిర్మాణాల విషయంలో పట్టాలను కలిగిన పేదలకు ఒక లాగ డబ్బున్న వారికి సిఫార్సులు చేసిన వారికి ఒకలాగ వ్యవహరించి నిర్మాణాలు తొలగిస్తున్నారని, ఇది సరికాదని, కాలువలను ఆక్రమించి జరుగుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు, పార్కులు గుర్తించి వాటిని రక్షించుకునేందుకు బోర్డులు ఏర్పాటు చేసి,ప్రహరీ గోడలు నిర్మించి రక్షణ కల్పిస్తామని తెలిపారు. సచివాలయాల్లో ఉద్యోగులు అందుబాటులో ఉండటం లేదని కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉందని, వాటి నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు చేపట్టాలని ఫ్లోర్ లీడర్ రాజేష్ అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులు మార్చి నెలాఖరు నాటికి పూర్తి అయ్యే విధంగా చర్యలు చేపడుతున్నామని ఇఇ ప్రసాదరావు, డిఇ శ్రీనివాసరావు తెలిపారు.

**17 అంశాలతో కూడిన అభివృద్ధి పనులకు ఆమోదం**

ఎజెండాలో 17 అంశాలతో కూడిన అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వాటిలో ప్రధానంగా జంతువధ శాల నిర్మాణానికి గునుపూరు పేట వద్ద ఐదు ఎకరాలు భూమిని కేటాయిస్తూ , రూ.35 కోట్లతో చేపట్టాలని ప్రాథమిక అంచనాకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 2024 లో రూ.38,20 లక్షలతో చేపట్టాల్సిన నాలుగు అభివృద్ధి పనులు చేయకపోవడంతో వాటిని రద్దు చేస్తూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. నగరంలో జీబ్రా క్రాసింగ్ లైన్లు ఆరు ప్రాంతాల్లో వేసేందుకు రూ.117 లక్షలతో చేపట్టాల్సిన పనులకు ఆమోదం తెలిపింది. వీధి కుక్కలు నియంత్రణకు షెడ్లు , ఫౌండ్సు, కెజిఎస్ లను నిర్మించేందుకు రూ.39.98 లక్షల కేటాయిస్తూ ఆమోదం తెలిపారు. నగరంలో 8 జంక్షన్లలో సిగ్నల్ లైట్లు రెండేళ్ల నిర్వహణకు రూ. 1,50,39,000తో కొత్త లైట్లు వేసేందుకు హైదరాబాద్ వారికి బాధ్యతలు అప్పగిస్తూ ఆమోదం తెలిపింది. 17వ డివిజన్ జిన్నగుడ్డి లో మరుగుదొడ్లు నిర్మాణానికి రూ.31.60 లక్షలు కేటాయిస్తూ ఆమోదం తెలిపారు. 15 వ.ఆర్థిక సంఘం నిధులు రూ.8.30 కోట్లతో చేపట్టాల్సిన పనులకు ఆమోదం తెలిపారు. అనంతరం ప్రత్యేక ఎజెండాలో బిపిఎస్, ఎల్ఆర్ ఎస్ వంటి వాటిపై పెట్టిన అంశాలను ఆమోదించారు.

**నగరాభివృద్ధే ధ్యేయం : మేయర్**

అనంతరం మేయర్ వి.విజయలక్ష్మి మాట్లాడుతూ సమావేశంలో 17 అజెండా అంశాలు, 4 అనుబంధ అంశాలు పొందుపర్చి చర్చించామని, నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు 70శాతం పూర్తయ్యాయని మేయర్ వి.విజయలక్ష్మి తెలిపారు. కుక్కల నియంత్రణకు తగుచర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించామన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పామన్నారు. అందరి సహకారంతో నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో కమిషనర్ నల్లనయ్య, అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు, కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి మోహనరావు

## ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

### టెట్‌ను రద్దు చేయాలి : యుటిఎఫ్ • కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం చేసి, ఉపాధ్యాయులకు పెట్టిన టెట్‌ను రద్దు చేయాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు యుటిఎఫ్ ఆధ్వర్యాన గురువారం కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, జెఎవిఆర్‌కె.ఈశ్వరరావు మాట్లాడుతూ 2010 ముందు అపాయింట్ అయిన టీచర్లకు టెట్ రద్దు చేయాలని, ఆ మేరకు విద్యా హక్కు చట్టం సవరించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు. టెన్త్ విద్యార్థులకు వంద రోజుల ప్రోగ్రాంలో విద్యార్థుల శారీరక మానసిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆదివారాలు, సెలవు రోజులలో క్లాసులు రద్దు చేయాలని. ఎఫ్ ఎల్ ఎన్ 75 రోజుల ప్రోగ్రాం అమల్లో కూడా విద్యార్థులకు స్వేచ్ఛగా వారికి రాని అంశాలు నేర్పించే అవకాశం కల్పించాలని అన్నారు. సింగిల్ టీచర్లు ఒహెచ్ లు ఉపయోగించుకొనే విషయంలో పడుతున్న ఇబ్బందులను తొలగించాలని కోరారు. అనేక ఉపాధ్యాయ సమస్యలు ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు జెఆర్‌సి పట్నాయక్, రాష్ట్ర నాయకులు కె.విజయ గౌరీ, జిల్లా గౌరవాధ్యక్షులు మీసాల అప్పలనాయుడు, సహాధ్యక్షురాలు జి.పార్వతి, జిల్లా కార్యదర్శులు సిహెచ్ తిరుపతి నాయుడు, అల్లు శంకర్రావు, మండల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కాలిపోతున్న చెరకు

## 15 ఎకరాల చెరకు తోట దగ్ధం

ప్రజాశక్తి- రేగిడి

రేగిడి పిహెచ్‌సి వెనుక భాగంలో ఉన్న 15 ఎకరాల చెరకు తోట గురువారం దగ్ధమైంది. లావేటి విష్ణుమూర్తి 3 ఎకరాలు, ముంజేటి సన్యాసినాయుడు 2 ఎకరాలు, జల్లు సాయిరాం ఎకరం, జల్లు సింహాద్రి ఎకరం, కరణం గోవింద 50 సెంట్లు చెరకు తోటలు దగ్ధమయ్యాయి. ముంజేటి వెంకటప్పల నాయుడు 2 ఎకరాలు చెరకు తోటలు దగ్ధం కాగా, మరో నలుగురివి నాలుగున్నరెకరాలు చెరకు తోటలు అగ్నికి ఆహుతి అయ్యాయి. స్థానికులు పాలకొండ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో మంటలను ఆర్పారు. సకాలంలో ఫైర్ ఇంజన్ రావడంతో పెను ప్రమాదం తప్పింది. లేకుంటే చాలా చెరుకు తోటలు అగ్నికి ఆహుతి అయ్యేవని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యుల రోదన మిన్నంటింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు ఇలా అగ్నికి ఆహుతి కావడంతో ఆవేదనకు గురయ్యారు. సంకిలి షుగర్ ఫ్యాక్టరీకి కొన్ని రోజుల్లో క్రషింగ్‌కు తీసుకువెళ్దామని అనుకున్న తరుణంలో ఇలా చెరుకు తోటలు దగ్ధం కావడం బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పరంగా పేద రైతులను నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

## పారిశ్రామిక రంగానికి ప్రోత్సాహం

### రాష్ట్రంలో 2 ఎంఎస్‌ఎంఇ విస్తరణ కేంద్రాలు : మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎంఎస్‌ఎంఇలను ప్రోత్సహించే లక్ష్యంతో సిఎం చంద్రబాబు రూపొందించిన ప్రతిష్టాత్మక కార్యక్రమం 'ఒక కుటుంబం- ఒక పారిశ్రామికవేత్త' కు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర ఎంఎస్‌ఎంఇశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలో ఎంఎస్‌ఎంఇ విస్తరణ కేంద్రాల ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం అనంతపురం, విజయనగరంలో ఏర్పాటుకు ఆమోదం తెలిపిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ మంత్రిత్వ శాఖకు ఒక ప్రతిపాదనను పంపి సంబంధిత మంత్రి, అధికారులకు ఎంఎస్‌ఎంఇ విభాగానికి మార్గనిర్దేశం చేయడం కోసం తాము చేసిన ప్రయత్నాలు, ఎంఎస్‌ఎంఇ మంత్రిత్వ శాఖతో సంప్రదింపుల ఫలితంగా, అనంతపురం, విజయనగరంలో రెండు ఎంఎస్‌ఎంఈ విస్తరణ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి కేంద్రం అమోదం తెలిపిందని తెలిపారు. ఈ కేంద్రాలు సాంకేతిక సహాయం, నైపుణ్యాభివృద్ధి, ఇంక్యుబేషన్ , కన్సల్టెన్సీ సేవలు వంటి సమగ్ర మద్దతును అందించడం ద్వారా ఎంఎస్‌ఎంఇ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేస్తాయని తెలిపారు. ఔత్సాహిక పెట్టుబడిదారులకు సరసమైన ధరలకు భూమి, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూసుకోవడానికి ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రత్యేక ఎంఎస్‌ఎంఇ పార్కు అభివృద్ధిని వేగవంతం చేస్తోందని తెలిపారు. కొత్త విస్తరణ కేంద్రాలు విశాఖపట్నంలోని ఎంఎస్‌ఎంఇ టెక్నాలజీ సెంటర్ మార్గదర్శకత్వంలో పనిచేస్తాయని తెలిపారు. స్థానిక పరిశ్రమలకు, అధునాతన యంత్రాలను అనుసంధానం చేసే అవకాశం కలుగుతుందని చెప్పారు.

## హెచ్ఇసిఐ బిల్లును రద్దు చేయాలి

### ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

హెచ్ఇసిఐ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కాంప్లెక్స్ వద్ద గురువారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి డి. రాము మాట్లాడుతూ క్యాబినెట్ 'వికసిత్ భారత్ శిక్షా అధీక్షక్ బిల్లు 2025' ఆమోదాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. గతంలో 2018లో ప్రవేశపెట్టిన 'హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా' బిల్లును, ఇప్పుడు 'వికసిత్ భారత్ శిక్షా అధీక్షక్' పేరుగా మార్చి యూనియన్ క్యాబినెట్ ఆమోదించడాన్ని ఖండించారు. యుజిసి, ఎఐసిటిఇ , ఎన్‌సిటిఇ వంటి సంస్థల స్థానంలో హెచ్ఇసిఐ వంటి ఒకే నియంత్రణ సంస్థను తీసుకురావడం ద్వారా ఉన్నత విద్యా రంగాన్ని కేంద్రీకరించడమే ఈ బిల్లు లక్ష్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసం, అర్ఎస్ఎస్ మతపరమైన ప్రయోజనాల కోసం విద్యా రంగాన్ని నిరంతరం కేంద్రీకరించడానికి, వాణిజ్య కరించడానికి ప్రయత్నిస్తోం దన్నారు. యుజిసిని రద్దు చేయడం వల్ల వృత్తి విద్యా కోర్సులు లేని ఉన్నత విద్యా సంస్థల గొంతు నులిమినట్లవుతుందన్నారు. తక్షణమే ఈబిల్లును ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వి.చిన్నబాబు, జిల్లా సహాయ కార్యదర్శులు ఎం.వెంకీ, ఆర్.శిరీష, రూప ఉపాధ్యక్షులు రమణ, రమేష్, జగదీష్, జిల్లా కమిటీ సభ్యులు సూరిబాబు,లక్ష్మి, జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోం

### మిల్లర్లకు ఎమ్మెల్యే హెచ్చరిక



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే బేబినాయన.. మిల్లర్లను హెచ్చరించారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో గురువారం వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో ధాన్యం కొనుగోలుపై సమీక్ష నిర్వహించారు. ఈ నెలాఖరులోగా 90శాతం వరకు ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం మిల్లింగ్ చేసే సమయంలో బియ్యం ముక్క అవ్వడం తగ్గిందని, కానీ అదే సాకుతో అదనంగా ధాన్యం అడిగితే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇ-క్రాప్ నమోదులో కొన్ని తప్పులు జరిగినట్లు తన దృష్టికి వచ్చిందని, తప్పులను సరి చేయాలని చెప్పారు. లేకుంటే తుపానుతో పంట నష్టపోయిన రైతులకు న్యాయం జరగదని చెప్పారు. వరి, మొక్కజొన్న సాగుపై మండలాల వారీగా అధికారులను ఆరాతీశారు. మొక్కజొన్న రైతులకు అవసరమైన ఎరువులను అందించాలని సూచించారు. డ్రోన్ ద్వారా పురుగుల మందులు, ఎరువులను పంటలకు అందించేలా చేసి, రైతులకు ఖర్చు తగ్గించేలా చూడాలన్నారు.

సమావేశంలో ఆర్‌డిఒ రామ్మోహనరావు, ఎఎంసి చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు, నాలుగు మండలాల తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## 'ఉపాధి' పేరు మార్పు సరికాదు

### కాంగ్రెస్ అధ్యక్షులు విద్యాసాగర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇటీవల మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును వి.బి.జి రామ్-జి గా మార్చడం కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిదర్శనమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మరిపి విద్యాసాగర్ అన్నారు. గురువారం తోటపాలెం మహాత్మా గాంధీ విగ్రహంవద్ద కాంగ్రెస్ శ్రేణులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుపిఎ1 ప్రభుత్వం వలసల నివారణకు ఉపాధి హామీ చట్టాన్ని చేసిందన్నారు. నాటి నుంచి నేటి వరకు గ్రామాల్లో ఉన్న ప్రజలు తమ గ్రామంలోనే ఉపాధి పొంది జీవిస్తున్నారని, అటువంటి ఈ పథకాన్ని బిజెపి ప్రభుత్వం పేరు మార్చి అందులో ఉన్న ముఖ్య ఉద్దేశాన్ని తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇటువంటి ప్రజా వ్యతిరేక బిల్లులను పార్లమెంట్‌లో ప్రజాప్రతినిధులంతా వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరుగబోయే పారా (వికలాంగుల ) పవర్ లిఫ్టింగ్ జాతీయ స్థాయి పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు అర్హత సాధించినట్లు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి, జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్ తెలిపారు. ఇటీవల విజయనగరం రాజీవ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పారా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన వడ్డి సతీష్ కుమార్ సాహు, తాళ్లపూడి గౌతమి పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం జాతీయ పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 16 నుండి 18 వరకు ఉత్తరాఖాండ్ రాష్ట్రంలో జరుగబోయే పారా జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు వీరు వెళ్తారని తెలిపారు. వీరి ఎంపిక పట్ల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అధితి గజపతిరాజు, కలెక్టర్ రాం సుందరరెడ్డి, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, జిల్లా క్రీడాభివ ద్ధి అధికారి ఎస్. వెంకటేశ్వరరావులు అభినందనలు తెలిపారు.

## సాంకేతికతలో ప్రపంచంతో పోటీ పడాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - భోగాపురం

సాంకేతిక పరిజ్ఞానం నగరాలకు మాత్రమే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా విస్తృతంగా అందుబాటులోకి రావాలని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. గురువారం భోగాపురంలోని మిరాకిల్ సిటీ వేదికగా ప్రారంభమైన ప్రతిష్టాత్మక 'డిజిటల్ సమ్మిట్-2025' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ సదస్సుకు మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ సంస్థ స్పాన్సర్‌షిప్ అందించడం అభినందనీయమన్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ డిజిటల్ సమ్మిట్‌లో విద్యార్థుల కోసం పలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ ప్రతినిధులు, వివిధ విద్యాసంస్థల విద్యార్థులు, సాంకేతిక నిపుణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## అండర్ బ్రిడ్జిలో నీరు లేకుండా చూడాలి





ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, గ్రామస్తులు, విద్యార్థులు

ప్రజాశక్తి - బొబ్బిలి రూరల్

మండలంలోని ఎం.బూర్జవలస రైల్వే అండర్ బ్రిడ్జిలో నీరు లేకుండా ప్రతిరోజూ తోడాలని గురువారం సిపిఎం ఆధ్వర్యంలో విద్యార్థులు, కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం మాట్లాడుతూ రైల్వే అండర్ బ్రిడ్జిలో నిరంతరం నీరు ఉండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. నీటిలో రోజూ వెళ్లడంతో విద్యార్థుల సైకిళ్లు, కార్మికుల ద్విచక్ర వాహనాలు, ఆటోలు మరమ్మతులకు గురవుతున్నాయన్నారు. అండర్ బ్రిడ్జిలో నీరు లేకుండా చేయాలని, లేదంటే ఆర్‌యుబి మూసివేసి రైల్వే గేటు తెరవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.శంకరరావు, ఆటో యూనియన్ నాయకులు బొమ్మి వెంకటరమణ, కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**రైల్వే అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు**

ఎం.బూర్జవలస రైల్వే అండర్ బ్రిడ్జిలో నీరు లేకుండా చూడాలని రైల్వే ఇంజినీర్ సురేష్‌ను ఎమ్మెల్యే బేబినాయన కోరారు. సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టడంతో ఎమ్మెల్యే స్పందించి రైల్వే ఇంజినీర్‌కు ఫోన్ చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని సూచించారు. ధర్నాతో, ఎమ్మెల్యే ఆదేశాలతో రైల్వే అధికారులు అండర్ బ్రిడ్జిలో నీరు తోడి పూడికలు తీశారు.

## నైట్‌హాల్ట్ బస్సుకు రూట్ సర్వే



రూట్ సర్వే చేస్తున్న డిప్యూటీ మేనేజర్ జ్ఞానేశ్వరరావు

ప్రజాశక్తి-వేపాడ

విశాఖపట్నం నుంచి వేపాడ మండల కేంద్రానికి నైట్‌హాల్ట్ బస్సు సౌకర్యం కల్పించాలని సిఎం చంద్రబాబు నాయుడుకు సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు ఇటీవల అర్జీ అందజేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్‌టిసి ఉన్నతాధికా రుల ఆదేశాలతో డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్‌వి జ్ఞానేశ్వరరావు గురువారం రూట్ సర్వే చేపట్టారు. సామాజిక కార్యకర్త అప్పారావు సమక్షంలో సర్వే చేసి, స్టాప్‌ల వివరాలు కూడా సేకరించారు. విశాఖపట్నంలో రాత్రి 7:30 గంటలకు బయల్దేరి వేపాడలో నైట్‌హాల్ట్ ఉండేలా, ఉదయం 5.30 గంటలకు తిరిగి బయల్దేరి విశాఖ వెళ్లేలా చూడాలని అప్పారావు కోరారు. స్టాప్‌ల వివరాలను సైతం ఆయనకు వివరించారు. బస్సు రాకపోకలకు ఎటువంటి ఇబ్బందీ లేదని, ఈ విషయాన్ని ఆర్‌టిసి రీజనల్ చైర్మన్ దొన్నుదొర, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని జ్ఞానేశ్వరరావు తెలిపారు. బస్సు ఎప్పటి నుంచి నడుపుతారో ముందస్తుగా సమాచారాన్ని అందిస్తామని చెప్పారు.

## మతతత్వ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకుందాం


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిపిఐఎంఎల్ లిబరేషన్ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన వినోద్ మిశ్రా స్ఫూర్తితో మతతత్వ శక్తుల నుంచి దేశాన్ని, ప్రజా స్వామ్యాన్ని కాపాడుకుందామని ఆ పార్టీ నాయకులు బి.శంకర్రావు అన్నారు. వినోద్ మిశ్రా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి శంకర్రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ప్రారంభంలో జరిగిన విభిన్నాలను అధిగమిస్తూ పరిస్థితులకు అనుగుణంగా విధానాలను రూపొందించి నేడు జాతీయ స్థాయిలో బలమైన విప్లవ వామపక్ష పార్టీగా తీర్చిదిద్దడంలో వినోద్ మిశ్రా ముఖ్య పాత్ర పోషించారని అన్నారు. ప్రస్తుతం మోడీ ప్రభుత్వ పాలనలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నాయని, వాటిని కాపాడు కునేందుకు వామపక్ష ప్రజాస్వామ్య శక్తుల ఐక్యత ఎంతో అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం. అప్పలరాజు, బి.గిరిప్రసాద్ జి.సత్యారావు, ఎం.పైడిరాజు, డి.సన్యాసిరావు, కె.గౌతవి తదితరులు పాల్గొన్నారు.

## బూత్ స్థాయిలో ఏజెంట్లను నియమించాలి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

ప్రతీ పోలింగ్ బూత్‌కు తమ ప్రతినిధిగా ఒక ఏజెంట్‌ను (బిఎల్ఎ) రాజకీయ పార్టీలు నియమించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి మురళి కోరారు. తమ ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని వ్యక్తులను అదే నియోజకవర్గంలో ఎక్కడైనా బిఎల్ఏగా నియమించుకొనే వెసులుబాటును ఎన్నికల కమిషన్ కల్పించిందని తెలిపారు. బిఎల్ఎలను నియమించుకోవడం ద్వారా ఎన్నికల ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు దోహదపడుతుందని అన్నారు. ప్రస్తుతం జిల్లాలో 15,73,576 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. మార్పులు, చేర్పులు, తొలగింపులకు ఓటర్లు ఎప్పుడైనా ధరఖాస్తు చేయవచ్చునని తెలిపారు. తమ దరఖాస్తు స్థితిని ఏ పౌరుడైనా ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చునని డిఆర్ఒ సూచించారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు టిడిపి నుంచి ఐవిపిరాజు, వైకాపా నుంచి శ్రీనివాసరెడ్డి, సిపిఎం నుంచి టి.సూర్యనారాయణ, బిఎస్‌పి నుంచి సోములు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి మురళి

## బుడా ఛైర్మన్ తెంటుకు మాతృవియోగం

ప్రజాశక్తి-బాడంగి



తెంటు సత్యవతమ్మ (ఫైల్)

బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (బుడా) ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడు మాతృమూర్తి తెంటు సత్యవతమ్మ (70) ఆకస్మికంగా మరణించారు. బాడంగి మండలం ముగడ గ్రామానికి చెందిన సత్యవతమ్మ కొన్ని రోజుల క్రితం హైదరాబాద్‌లో కుమార్తె వద్దకు వెళ్లారు. బుధవారం రాత్రి నిద్రలో మరణించినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. సత్యవతమ్మ భర్త తెంటు జయప్రకాశ్ ఐదు పర్యాయాలు తెర్లాం ఎమ్మెల్యేగా పనిచేశారు. కుమారుడు తెంటు లక్ష్మునాయుడు ఓసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. సత్యవతమ్మ మృతికి ఎమ్మెల్యే బేబీనాయన సంతాపం తెలిపారు. సత్యవతమ్మ పార్థివదేహాన్ని స్వగ్రామం ముగడ తీసుకొస్తున్నారు.

## గంజాయి రవాణా నివారణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

గంజాయి, మత్తు పదార్థాల రవాణా నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిఆర్‌పి ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్ కోరారు. స్థానిక రైల్వే పోలీస్‌స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి సిబ్బంది సంయుక్తంగా రైల్వే స్టేషన్, ప్లాట్‌ఫాం, రైళ్లలో చోరీలు జరగకుండా చూడాలని ఆదేశించారు.

## డివిజన్ స్థాయి క్రికెట్ విజేత తెర్లాం

ప్రజాశక్తి - బొబ్బిలి

ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రభుత్వం నిర్వహిస్తున్న డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలో విజేతగా తెర్లాం ఉపాధ్యాయులు నిలిచారు. స్థానిక పాత చక్కెర కర్మాగారం సమీపంలో ఉన్న వీరబొబ్బిలి క్రీడా మైదానంలో గురువారం డివిజన్ స్థాయి పోటీలు జరిగాయి. రామభద్రపురం, తెర్లాం ఉపాధ్యాయుల జట్ల మధ్య ఫైనల్ పోటీల్లో తెర్లాం జట్టు విజేతగా నిలిచింది. జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. విజేతకు, రన్నర్‌కు ఎమ్మెల్యే బేబీనాయన ట్రోఫీలను ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఇఒలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోలీసుస్టేషన్‌లో మాట్లాడుతున్న డిఎస్‌పి భవ్యరెడ్డి

## పోలీసుస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-తెర్లాం

తెర్లాం పోలీస్ స్టేషన్‌ను గురువారం బొబ్బిలి డిఎస్‌పి భవ్యరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు పరిశీలించారు. మండలంలో లా అండ్ ఆర్డర్ గురించి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులన్నీ సత్వరమే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. మహిళలపై అత్యాచార కేసులో 40 రోజుల్లో పరిష్కరించి దోషులను రిమాండ్ పంపించాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వాహన తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు, తెర్లాం ఎస్ఐ సాగర్‌బాబు పాల్గొన్నారు.

## వృత్తిపరమైన శిక్షణతో ఉపయోగం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో నేర్చుకున్న వృత్తిపరమైన శిక్షణ తనకు ఎంతగానో దోహదపడిందని అనస్థీషియా పూర్వ విద్యార్థి కనకమహాలక్ష్మి అన్నారు. గురువారం ఆమె పూర్వవిద్యార్థుల చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజ జీవితంలో వృత్తిపరమైన సవాళ్లను ఎదుర్కోవడానికి నాణ్యమైన విద్య, ఆచరణాత్మక క్లినికల్ ఎక్స్‌పోజర్ ప్రతి విద్యార్థికి అవసరమన్నారు. మరో విద్యార్థి ఎస్. వెంకట శ్వేత క్లినికల్ లెర్నింగ్ అనుభవాలను పంచుకున్నారు. ఆపరేషన్ థియేటర్ విధానాలు, రోగి పర్యవేక్షణ, అనస్థీషియా పరికరాల నిర్వహణ, నిజమైన ఆసుపత్రి సెట్టింగ్‌లలో జట్టు కృషిలో ఆమె పొందిన విస్తృతమైన ఆచరణాత్మక అనుభవాన్ని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలనా తేజ డాక్టర్ ఎం. వినోద్ కుమార్, కె. సౌగంధిక, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధ్యతగా పనిచేయాలి

ప్రజాశక్తి - భోగాపురం

ఉద్యోగులు బాధ్యతగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఎంపిడిఒ డిడి. స్వారూపారాణి అన్నారు. ఆమె గురువారం గూడెపువలస, అమటాం రాయివలస గ్రామ సచివాలయాలను, ప్రాథమిక పాఠశాలలను, అంగన్వాడీ సెంటర్లను సందర్శించారు. గుండెపువలస అంగన్వాడీ సెంటర్‌ను పరిశీలించి స్టాక్ సంబందించిన రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గ్రామసచివాలయాన్ని సందర్శించి అమలు చేస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో అమలు చేస్తున్నా మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వండిన వంటకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు సమయం పాటించాలని, ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేసి మండలాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకు వెళ్లాలని సూచించారు.

## ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని కొంపల్లి గ్రామంలో వేపాడ పశువైద్యాధికారి కోరాడ గాయత్రి ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 21 మంది రైతులకు చెందిన పశువులకు వైద్య సేవలు అందించారు. 7 పశువులకు కృత్రిమ ధారణ ఇంజెక్షన్లు, 22 పశువులకు చూలు తనిఖీలు చేశారు. మందులు పంపిణీ చేశారు. పశువైద్య సిబ్బంది, పశుసంవర్థక సహాయకులు పాల్గొన్నారు.

## పక్కాగా యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రభుత్వ పథకాలకు అర్హులుగా గుర్తించేందుకే యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పక్కాగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే శిక్షణలో ఆయన పాల్గొని, దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ విష్ణుమూర్తి, సీనియర్‌అసిస్టెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-శృంగవరపుకోట

యుటిఎఫ్ శృంగవరపుకోట మండల కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఈ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా జివి రమణ, ఎన్నికల పరిశీలకులుగా జెఎవిఆర్‌కె ఈశ్వరరావు వ్యవహరించారు. గౌరవ అధ్యక్షులుగా విఎస్ దేముడు, అధ్యక్షులుగా ఎంవిఎస్ నారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎ.రాము, ఉపాధ్యక్షులుగా ఎ.శ్రీనివాస్, ఎ.వి.లక్ష్మి, కోశాధికారిగా ప్రసాద్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జి.వెంకటరావు మాట్లాడుతూ ఈ నెల 28న విజయనగరంలో శేషగిరి విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## పోలియో చుక్కలు తప్పనిసరి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలని కొట్టాం పిహెచ్‌సి వైద్యులు హారిక తెలిపారు. ఈ నెల 21న పల్స్ పోలియో సందర్భంగా పోలియో చుక్కలు వేసే బూత్ లెవెల్ వాక్సినేటర్లకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. 21 బూత్ స్థాయిలో, తప్పిపోయిన మిగతా వారికి 22, 23న ఇంటింటి సర్వే చేసి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లావణ్య, డాక్టర్ మానస, తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలో రావాడ జిల్లా పరిషత్తు పాఠశాలలో గురువారం నిర్వహించిన మండల స్థాయి సైన్స్ ఫెయిర్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని డిఇఒ మాణిక్యంనాయుడు, డిసిఇబి కన్వీనర్ సన్యాసి రాజు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన వివిధ శాస్త్రీయ నమూనాలు, థీమ్‌లను ఆసక్తిగా పరిశీలించి, విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి మేధస్సును పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో డిఇఒ ముచ్చటించి 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు తీరుపై విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు విలువైన సూచనలు, సలహాలు అందించారు. క్రమబద్ధమైన చదువు, టైమ్ టేబుల్, రోజువారీ రివిజన్, ఉపాధ్యాయుల మార్గనిర్దేశాన్ని పాటించాలని సూచించారు. మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన



వేపాడ : వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఇఒలు



విద్యార్థుల సైన్సు ప్రదర్శనలను తిలకిస్తున్న డిఇఒ మాణిక్యం నాయుడు

విద్యార్థులు శుక్రవారం విజయనగరంలోని సంస్కృత పాఠశాలలో నిర్వహించనున్న జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శనలో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు రమణ మూర్తి, చంద్రమౌళి పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న ప్రదర్శనలు**

**వేపాడ :** వేపాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలను ఎంఇఒలు ఎన్.నాగభూషణరావు, పి.బాలభాస్కరరావు సందర్శించి, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.ఎస్ వల్లి, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

# ఏకగ్రీవంగా ఎపిఎన్‌జిఒ తాలూకా ఎన్నిక

ప్రజాశక్తి- రాజాం




ఎన్నికైన ఎపి ఎన్‌జిఒ తాలూకా యూనిట్ నాయకులు

రాజాం తాలూకా యూనిట్ ఎపిఎన్‌జిఒ నూతన కార్యవర్గం ఎన్నికలు గురువారం ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా నామినేషన్ ప్రక్రియలో సింగల్ సెట్ నామినేషన్‌లు రావడంతో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని ఎన్నికల అధికారి ఎల్. అప్పలనాయుడు, సహాయ ఎన్నికల అధికారి ఎమ్. అప్పలస్వామి తెలిపారు. నూతన అధ్యక్షుడుగా వావిలపల్లి శ్రీనివాసరావు, అసోసియేట్ ప్రెసిడెంటుగా కె. హరిబాబు, ఉపాధ్యక్షులు డి.అప్పలనాయుడు, బి.అనిల్ కుమార్, డి. కిశోర్‌కుమార్, కె.వేణు, వైస్ ప్రెసిడెంట్ (మహిళ) కె. జ్యోతిర్మయి, కార్యదర్శి బి. ప్రకాశ్ రాజ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్.పవన్ కుమార్, జాయింటు సెక్రటరీలుగా వి.సన్యాసినాయుడు, జి. వెంకటేష్, ఎస్. తరుణ్ కుమార్, కె.రాము, జాయింటు సెక్రటరీ మహిళా టి.ఈశ్వరమ్మ, కోశాధికారి, కె. ఈశ్వర రావు, స్టేట్ కౌన్సిల్ మెంబరు ఎస్. రాజ శేఖర్, డిఇసి మెంబరులు పి.జగదీశ్వరరావు, ఎ. నాగ భూషణం, కె.దిలీప్, బి.రవిచంద్ర ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల పరిశీలకులుగా బి సురేష్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన అధ్యక్ష కార్యదర్శులు హెచ్. సాయిరాం, సి. హెచ్. శ్రీనివాసరావు, పార్వతీపురం మన్యం జిల్లా అడ్‌హాక్ కమిటీ ఛైర్మన్ జి.విఆర్. ఎస్.కిషోర్, విజయనగరం జిల్లా ఎపిఎన్‌జిఒ అధ్యక్షులు టి.శ్రీధర్ బాబు, కార్యదర్శి ఎ.సురేష్, తహశీల్దార్ రాజశేఖర్, ఉపాధ్యక్షులు కెబి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలు

**టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామకృష్ణ**

ప్రజాశక్తి-రామభద్రపురం



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు చింతల రామకృష్ణ

రాజకీయ పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందజేస్తున్న ఘనత సిఎం చంద్రబాబునాయుడుకే సాధ్యమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో మండల అధ్యక్షులు కరణం విజయ భాస్కరరావుతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కూటమి ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేయడం పద్ధతి కాదన్నారు. అధికార యంత్రాంగాన్ని ఉపయోగించుకొని అర్హులైన వారికి పథకాలు అందకుండా టిడిపి గ్రామ నేతలు అడ్డుకుంటున్నారని పత్రికా సమావేశాల్లో చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వైసిపి సానుభూతిపరుల ఇళ్లకు జియో ట్యాగింగ్ చేయకుండా అడ్డుకుంటున్నారని చెప్పడం హాస్యాస్పదం అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలోనే పక్షపాతం, బంధుప్రీతితో టిడిపి కార్యకర్తలకు పథకాలు అందకుండా చేసిన దుర్మార్గ చర్యలు గుర్తుచేసుకోవాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వ లక్ష్యాన్ని చేరువ చేయడమే తమ కర్తవ్యమని చెప్పారు. ఎమ్మెల్యే బేబీనాయన అహర్నిశలు తమకు దిశా నిర్దేశం చేస్తున్నారని తెలిపారు. ప్రతీ పథకాన్ని పారదర్శకంగా అర్హులను గుర్తించి అందజేస్తున్నట్లు వివరించారు. ప్రతిపక్షాలు నిందలు వేయకుండా రుజువులతో నిరూపించాలని సవాలు విసిరారు. సమావేశంలో సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, పార్టీ మండల నాయకులు చిన్నమ్మతల్లి, శ్రీనివాసరావు, యోగి నాయుడు, సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

**సత్యవతమ్మ మృతికి సంతాపం**

మాజీ ఎమ్మెల్యే తెంటు జయప్రకాశ్ సతీమణి, బుడా ఛైర్మన్ లక్ష్మునాయుడు మాతృమూర్తి సత్యవతమ్మ మృతికి టిడిపి నేతలు సంతాపం తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో చింతల రామకృష్ణ ఆధ్వర్యంలో మండల నాయకులు, కార్యకర్తలు శ్రద్ధాంజలి ఘటించారు.

## టిడిపి కార్యాలయంలో మినీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి కార్యాలయం అశోక్‌బంగ్లాలో గురువారం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి ఆధ్వర్యాన మినీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారుల సమక్షంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భావితరాలకు మనం ఇచ్చే ఆస్తి కేవలం చదువు ఒక్కటే అని అన్నారు. క్రీస్తు చూపిన, ప్రేమ, సేవా తత్వంతో అంతా మెలగాలన్నారు. కార్యక్రమంలో క్రిస్మస్ మైనార్టీ ప్రెసిడెంట్ గుల్లిపల్లి రాజు, పాస్టర్ విక్టర్ ఆశిష్, ఎలీషా రాజశేఖర్, ఆర్ ఎస్ జాన్, మిగతా చర్చి పెద్దలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఐవిపి రాజు, రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, టిడిపి పట్టణ అధ్యక్షులు గంటా రవి, పట్టణ ప్రధాన కార్యదర్శి కోదండరాం, మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలి నాయుడు, ప్రధాన కార్యదర్శి పాసి అప్పలనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

## మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపాలిటీలో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్‌బాబు తెలిపారు. స్థానిక మున్సిపాలిటీలో గురువారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పదో వార్డులో రూ.4 లక్షలతో, 18వ వార్డులో రూ. 2.30 లక్షలతో, 25వ వార్డులో రూ.5 లక్షలతో సిసి రోడ్లు, 15వ వార్డులో రూ. 5 లక్షలతో కల్వర్టు, 17వ వార్డులో రూ.4 లక్షలతో, 17వ వార్డులో రూ.6.08 లక్షలతో సిసి కాలువలు, 30వ వార్డులో రూ.4.50 లక్షలతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కమిషనర్ రామలక్ష్మిని ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## వైద్య కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలని నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలని సిపిఐ ఆధ్వర్యాన గురువారం పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, జిల్లా నాయకులు కోట అప్పన్న, పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ ఎఐఎస్‌ఎఫ్ డివిజన్ కార్యదర్శి వి.శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు

## విద్యా ప్రణాళికపై ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలతో వంద రోజుల విద్యా ప్రణాళికపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంపొందించే లక్ష్యంగా విద్యా ప్రణాళిక అమలు చేయాలన్నారు. సమావేశంలో ఎంఇఒలు ఎన్.నాగభూషణరావు, పి.బాలభాస్కర్‌రావు పాల్గొన్నారు.

## ఉపయోగించని వీల్ చైర్లను అందజేయండి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎవరి వద్దనైనా నిరుపయోగంగా ఉండే వీల్ చైర్లు, ఊత కర్రలు, లేవెట్రీ స్టాండ్లను అవసరమైన వారికి అందజేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి, అఖిల భారత అవయవదాతల సంఘం రాష్ట్ర కార్యదర్శి షిణగం శివాజీ విజ్ఞప్తి చేశారు.గురువారం బొబ్బాదిపేటకు చెందిన కొల్లి వెంకట నాయుడు సతీమణి కొల్లి పద్మిని తన ఇంట్లో నిరుపయోగంగా ఉన్న వీల్ చైర్, ఊత కర్ర,లేవట్రీ స్టాండ్‌ను మంచానికి పరిమితమైన గరివిడి మండలం కొండశంభాం గ్రామానికి చెందిన గొర్లె పెంటమనాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ ఈ విధంగా ఎవరి ఇండ్లలోనైనా ఇటువంటి పరికరాలు నిరుపయోగంగా ఉంటే మంచానికి పరిమితమైన నిరుపేద రోగులకు అందజేస్తే ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో కాళ్ళ రామారావు, బోర గోవిందమ్మ పాల్గొన్నారు.

## మెరుగైన సేవలందించాలి : డిడి

ప్రజాశక్తి- రేగిడి

సచివాలయ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా ఫిషర్స్ డిడి, మండల ప్రత్యేక అధికారి విజయ్ కృష్ణ అన్నారు. గురువారం ఆర్.ఆమదాలవలస, రేగిడి, పెద్దశిర్లాం, బూరాడ గ్రామాల్లో సచివాలయాలను సందర్శించారు. ఉద్యోగుల పనితీరుపై శాఖల వారీగా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు అర్హులకు అందేలా చూడాలన్నారు. విధులకు సకాలంలో హాజరు కావాలని, లేకుంటే షోకాజ్ నోటీసులు తప్పవని హెచ్చరించారు. సచివా లయ ఉద్యోగులు ప్రజలకు జవాబుదారి తనంగా ఉండాలని అన్నారు. ఎస్ఒతో పాటు ఎంపిడిఒ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.





బహుమతులు అందుకుంటున్న పోస్టల్ ఉద్యోగులు

# బీమా పథకాలపై అవగాహన అవసరం

**పోస్ట్ మాస్టర్ జనరల్ విఎస్ జయశంకర్వి**

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ ప్రజలకు బీమా పథకాలపై అవగాహన కల్పించేందుకు బీమా సంకల్ప్ 2.0 పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విశాఖపట్టణం రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ వి .ఎస్. జయశంకర్ తెలిపారు. భవిష్యత్తులో తపాలా సేవలతో పాటు బీమా పథకాలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తామన్నారు. విజయనగరంలోని జిల్లా పరిషత్తు సమావేశమందిరంలో గురువారం జరిగిన బీమా సంకల్ప్ మేళాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సెప్టెంబర్‌లో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించిన విజయనగరం డివిజన్ అధికారులను, ఉద్యోగులను అభినందించారు. 46 మందికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. విజయనగరం డివిజన్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్, సహాయ సూపరింటెండెంట్లు జి.వి.రమణారావు, టి. సుంద రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

**నెల్లిమర్ల సబ్ పోస్టాఫీస్‌కు అరుదైన గౌరవం**

**నెల్లిమర్ల :** స్థానిక సబ్ పోస్టాఫీస్‌కు అరుదైన గౌరవం దక్కింది. స్థానిక సబ్ పోస్టు ఆఫీస్ ఇన్సూరెన్స్, అకౌంట్లు ఓపెన్ చేయడంలో ప్రతిభ చూపినందుకు అవార్డు లభించింది. ఈ సందర్భంగా రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ చేతుల మీదుగా అవార్డును నెల్లిమర్ల సబ్ పోస్టుమాస్టర్ ఎర్రయ్య గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అందుకున్నారు. సహకారం అందించిన సిబ్బందికి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందని ప్రజలకు పోస్టల్ సేవలను మరింత చేరువ చేస్తామని పోస్టు మాస్టర్ ఎర్రయ్య తెలిపారు.



బడుకొండ హారికకు సిఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి

# సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం నియోజకవర్గానికి చెందిన 13 మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 9,62,293 విలువగల చెక్కులను గురువారం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎంతోమంది దీర్ఘకాలిక రోగులకు, అత్యవసర రోగులకు వైద్య సహాయార్థ ఖర్చులకు సిఎం సహాయ నిధి నుంచి ఎప్పటికప్పుడు డబ్బులు మంజూరు చేయడం గొప్ప విషయం అన్నారు. ఇందులో విజయనగరం నియోజకవర్గంలో పట్టణ పరిధిలో ముగ్గురికి మండల పరిధిలో పదిమందికి చెక్కులను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు గంటా రవి , ప్రధాన కార్యదర్శి కోదండరాం, మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలినాయుడు, ప్రధాన కార్యదర్శి పాసి అప్పలనాయుడు, రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, ఆవనాపు విజయ్, గాడు అప్పారావు, కుటుంబరావు, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

**యువతకు వాలీబాల్ కిట్‌లు పంపిణీ**

గుంకలాం గ్రామంలో టిడిపి నాయకులు మహంతి శివ ఆధ్వర్యంలో ఇచ్చిన వాలీబాల్ కిట్టును ఆ గ్రామ యువతకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆటల్లో బాగా రాణించి మండలానికి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు

## 188వ రోజుకు జిందాల్ బాధితుల నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిందాల్ పరిశ్రమ కోసం సేకరించిన తమ భూములను తిరిగివ్వాలని కోరుతూ మండలంలోని బొడ్డవరలో నిర్వాసిత రైతులు చేస్తున్న నిరసన కార్యక్రమం గురువారం 188వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ మాట్లాడుతూ పోలీసులను అడ్డుపెట్టుకుని సాగు చేసుకుంటున్న రైతులను భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతుల పంట పొలాల్లోకి వెళ్లకుండా అడ్డుకునే హక్కు కంపెనీకి లేదని తేల్చిచెప్పారు. ఒప్పందం ప్రకారం నిర్ణీత కాలంలో కంపెనీ ఏర్పాటుచేయక పోవడంతో నిబంధనల మేరకు ఆ భూములు తిరిగి నిర్వాసితులకే చెందుతాయని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని జిందాల్ యాజమాన్యం చేస్తున్న భూవిక్రయాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి-గంట్యాడ

ప్రతి గ్రామంలోనూ బాల్యవివాహాలు జరగకుండా అరికట్టాలని గంట్యాడ పిహెచ్‌సి వైద్యాధికారి హేమలత కోరారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలనకు చేపట్టిన వంద రోజుల జాతీయ ప్రచార కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాల నిర్మూలన కోసం జిల్లా, మండల, గ్రామ పరిధిలో కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతా కలిసి బాల్య వివాహాల నిర్మూలన మండలంగా తీర్చిదిద్దాలని కోరారు. ఎంపిడిఒ ఆర్.వి.రమణమూర్తి మాట్లాడుతూ గ్రామాల్లో పేదరికం, మూఢనమ్మకాల వల్ల బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. పేదరిక నిర్మూలన కోసం అందరూ తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ ఉమాభారతి, బెజ్జిపురం యూత్ క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ ఝాన్సీరాణి, సిఎఒ విజయలక్ష్మి, సిహెచ్.పద్మ, నాయకులు పీరుబండి జైహింద్‌కుమార్, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.